

# శ్రీ సరస్వతీ శతకము

1. శ్రీకరమౌ సదా సకల సిద్ధులొసంగెడి నీదు గాథలన్
లోకహితమ్ము గోరి సరళీకృతమౌ మధుపద్యమాలగా
తేకువతోడ నిన్ దలచి ధీటుగ వ్రాయను బూనుచుండగన్
నా కలమందు రంజిలుచు నందము గూర్చుమ శ్రీ సరస్వతీ!!

2. పరమదయానిధే విమల పావని స్నిగ్ధ సురూప శారదా
తిరమగు నీదు లీలలను తీరుగ వ్రాయను నేను బూనుచున్
శిరమును వంచి వేడ నిను చింతను దీర్చుచు నన్ను గావుమా
కరుణను జూపుచున్ శతకకర్తగ నీవె నిల్వుమ శ్రీసరస్వతీ!!

3. సగుణ పరాత్మికా సకల శాస్త్రనివాసిని బ్రహ్మరూపిణీ
నిగనిగ ప్రజ్వరిల్లు భువనేశ్వరి దైవ సుపూజితా కళా
వగపును దీర్చుచూ పరమపావన శక్తిగ నిల్వుమా సదా
ధగధగ వెల్గు సత్కవిగ ధాత్రిని నిల్పుమ శ్రీ సరస్వతీ!!

4. సురముని సన్నుతా లలిత శోభల రంజని రమ్యలోచనీ
గరిమల మంజుల ధవళకాంతుల శ్రీప్రద కామరూపిణీ
కరుణను జూపుచు విమల కావ్యము వ్రాసెడి శక్తి నీయుమా
మరిమరి వేడ నిన్ను కడు మాన్యత జూపుచు శ్రీ సరస్వతీ!!

5. పరమదయానిధే విమల పావని స్నిగ్ధ సురూప శారదా
తిరమగు నీదు లీలలను తీరుగ వ్రాయను నేను బూనుచున్
శిరమును వంచి వేడ నిను చింతను దీర్చుచు నన్ను గావుమా
కరుణను జూపుచున్ శతకకర్తగ నీవె నిల్వుమ శ్రీసరస్వతీ!!

6. అక్షరమాలలన్ నిలుప యద్భుత రీతిని నీ పదమ్ములన్
లక్షణమౌ గతి జనుచు లాహిరి యందున నిల్చినే సదా
రక్షణ గోరి వేడ నిను రమ్యపు పద్యములన్ లిఖింపగన్
లక్షణమౌ పదంబులను లక్షల నీయుమ శ్రీ సరస్వతీ!!

7. బాసరవాసినీ జయిని పావన రూపిణి మోహనాశినీ
బాసట నీయుమా జనని పావనమౌ శతకంబు వ్రాయగన్
ప్రాసల రీతులన్ దెలిపి వ్రాసెడి పద్యము దివ్యరత్నమై
భాసుర శోభలన్ నిలచు భాగ్యమునీయుమ శ్రీ సరస్వతీ!!

8. ఎల్లలు లేక నీ సతము నీప్సితమౌగతి మమ్ము గావుమా
పిల్లల రీతి మమ్ము గని పేర్మిని బంచుచు రక్షవై సదా
యుల్లమునందు కల్మషము యుక్తము తోడను పారద్రోలుచున్
చల్లని దీవెనల్ నిడుమ చక్కగ వ్రాయను శ్రీసరస్వతీ!!

9. ఆచమనీయమున్ నిడుచు నర్ఘ్యము పాద్యము నిత్తు భక్తితో
అంచితమౌ పదంబులకు నంజలి నిచ్చెద తల్లి మోదమున్
ఆచరణీయమౌ విధము నచ్చముగా నిను గొల్వ భారతీ
కాచుమ పద్యకావ్యముల కందువ నీయుచు శ్రీసరస్వతీ!!

10. వంకర బుద్ధినిన్ విడచి వాంఛల నన్నియు వీడి నిత్యమున్
శంకల నన్నియున్ మరచి శక్తులొసంగెడి దివ్యశక్తిగా
వంకలు మాని నే గొలువ భక్తిగ శ్రద్ధగ సంతసమ్మునన్
నాకము వీడి రంజిలుమ నా మది నిత్యము శ్రీసరస్వతీ!!

11. సొంపుగ పద్యమే గతిని శోభను గూర్చుచు నే లిఖించెదన్
చంపక ఉత్పలంబులచె చందముగర్చనమెట్లు జేసెదన్
పాపపుకర్మచే లలితభావములందక శోకమొందగా
ప్రాపుగ నిల్చిబ్రోవు నను భావఘురుల్ నిడి శ్రీసరస్వతీ!!

12. తేనెల తేటయౌ తెలుగుతీపిని జూపెడి పద్యమందునే
వీణను బట్టి విద్యనిడు వేల్పుగ శోభిలు నిన్ను నిల్పుచున్
వాణిగ గొల్వగా సతము వాక్కులతోడను దివ్యమౌ గతిన్
వేణిగ నాదరింపు నను వేతన దీర్చుచు శ్రీసరస్వతీ!!

13. సేద్యము జేయుచున్ సతము శ్రీకరమౌ గతి ఛందమందు నే
పద్యమె పూజగా దలచి పల్కుల తోడను సన్నుతింపగా
చోద్యము రీతినిన్ గనక శోభను గూర్చుమ కామరూపిణీ
వైద్యమొసంగుచున్ మదికి భావనలీయుమ శ్రీసరస్వతీ!!

14. వేదపురాణముల్ నెపుడు ప్రీతిగ నే జదువంగలేదులే
సాదరమౌ గతిన్ సకల శాస్త్రములెప్పుడు జూడలేదునే
నాదగు రీతిలో సతత నందముతోడను నిన్ను గొల్వగా
నాదరి నిల్వుమా జనని నాంది నొసంగుచు శ్రీసరస్వతీ!!

15. బంధములన్నియున్ విడచి బాంధవి నామది నిల్ప నిన్నునే
ఛందముతోడ సన్నుతిని చక్కగ సల్పుచు నుత్పలంబులన్
నందముగా తేజరిలు నద్భుత చంపక పద్యమాలలన్
నీదరి నిల్పగా గనుమ నెమ్మిని జూపుచు శ్రీసరస్వతీ!!

16. దైవసన్నుత బ్రహ్మపూజిత తాపవారిణి భారతీ
సేవలన్నియు జేయ నిత్యము స్నిగ్ధమౌగతి నిత్యమున్
గావరా నను ఛందసారము చక్కనౌ విధమిచ్చుచున్
భావమై మధుపద్యమై నను జేర రావ సరస్వతీ!!

17. హ్లాదమిచ్చును నీదు నామము నాలపించిన భక్తితో
వేదనంతయు దీరిపోవును పేర్మితో నిను దల్వగా
వేదరూపిణి రమ్యలోచని బేలగా నను నిల్వకన్
సాధనందున యోద్ధగా నిలు శక్తినీయు సరస్వతీ!!

18. హృదయమందున భావనమ్మగ ఎల్ల వేళల వెల్గుచున్
పదములందున నాట్యమాడుచు పావనమ్మగు జాలమై
ముదముతోడను సత్కవీంద్రుల మోహనమ్మగు పద్యమై
అదటుతోడను కాంతులీనుచు నాదరింపు సరస్వతీ!!
(అదటు: గర్వము)

19. శాంతవైనను పద్మవైనను సంతసమ్మున గొల్తునే
కాంతవైనను కామినైనను కార్యసిద్ధిని గోరుచూ
రాతమార్చెడి తల్లిగా నిను లక్షణమ్ముగ వేడగా
వేతనంతయు దీర్చుచూ దశవిద్యలిమ్ము సరస్వతీ!!

20. కుక్షియందున వేదవిద్యలు కోర్కె మీఱను నిల్పుచున్
అక్షరమ్ములకాలయంబుగ యంబవై వెలుగొందుచున్
పక్షివాహిని పాపనాశిని బ్రాహ్మిగా కొనియాడగా
రక్షనీయుచు దిక్కుజూపగ రావె దేవి సరస్వతీ!!

21. జన్మజన్మల పాపరాజిని చక్కనౌగతి బాపుచున్
జన్మజన్మల యార్తి దీర్చుచు సాంత్వనిచ్చెడు శక్తివై
తన్మయంబున సత్కవిత్వపు ధారవై దరిజేరుమా
చిన్మయంబున నన్ను బ్రోవుచు చింతదీర్చు సరస్వతీ!!

22. ధ్వాంతమంతయు పారద్రోలుచు దారి జూపెడి శక్తివై
చెంతజేరుమ భావనమ్మున చింతదీర్చెడి యుక్తివై
క్లాంతినంతయు దీర్చి నిత్యము కార్యసిద్ధినొసంగుచున్
పంతమంతయు వీడిజేరుమ పల్కులమ్మ సరస్వతీ!!

23. పంకజలోచనీ విమల పద్మనివాసిని పద్మభూషితా
పొంకముతోడనే గొలువ పొంతముగా నిను జ్ఞానరూపిణీ
శంఖలు వీడి నీ దరిని చక్కగ నిల్పుచు బంటురీతినిన్
వంకరబుద్ధి మాయలను బాపుచు గావుమ శ్రీసరస్వతీ!!
(పొంకము: పొందిక, పొంతము: స్నేహము)

24. సకలము నీవనంచు భవసాగరమందున శక్తిలేకయున్
సుకమును గోరి నీ పథము శోభగ నిల్చితి యుక్తితోడనే
యొకపరి నిన్ను గాంచగనె యోపగలేను నిరీక్షణమ్ముననన్
ప్రకటముజేయు నీ ధవళ పావనరూపము శ్రీసరస్వతీ!!

25. సామజపూజితా ధవళ సత్కళ శోభిత ధ్వాంతదీపికా
కామితదాయినీ లలితగామిని బ్రాహ్మిని జిహ్వవాసినీ
సమ్మతి జూపుమా శతకసంపుటి వ్రాయుచు సన్నుతింపగన్
ధీమతినై సదా సలుప తీరుగ సేవలు శ్రీసరస్వతీ!!

26. క్షోణితలంబునన్ జనులు కోమలివౌ నిను కోరివేడగా
వీణను బట్టియున్ లలిత విద్యలొసంగుచు గాచు తల్లివై
వేణిగ కావ్యశోభలను వేడుకగా నిడ సంతసమ్మునన్
రాణిగ మా మదిన్ నిలచి రంజిలు ధీటుగ శ్రీసరస్వతీ!!

27. పామరులైననేమి కడు పావనివౌ నిను సన్నుతించుచున్
క్షేమము గోరగా సతము కీర్తన జేయుచు దివ్యమౌగతిన్
కామితసిద్ధినింగొనుచు కష్టములన్నియు దొల్గి ధన్యులై
కోమలివైన నీ దరిని గోరుచు నిల్తురు శ్రీసరస్వతీ!!

28. హంసవాహిని జ్ఞానరూపిణి అంబవౌ నిను జేరనే
శ్వాస ధ్యాసలు మానసంబును సాధనమ్మన నిల్పుచున్
మాంసపూరిత దేహమే పరమాలయంబుగ దల్చుచున్
ఆశమీఅగ జేరుకొందునే నాత్మవైన సరస్వతీ!!

29. దేహమందున జీవనాడను దీప్తివై మము గావుచున్
సాహసంబుగ మానసంబున శక్తివై వెలుగొందుచున్
సాహితీపుర రాణిగా పదజాలమై మధువొల్కుచున్
నా హితమ్మను గోరు తల్లిగ నన్ను జేరు సరస్వతీ!!

30. తెల్లని హంస వాహనమున తెల్లనిచేలము నందు మౌక్తికై
చల్లని చూపుతో గనుచు సత్కవిగా నను నిల్పి గావుమా
కల్లలు కల్మషంబులను గారెడితోడను మాయజేయుచున్
తల్లిగ బుద్ధినిచ్చి ఘనతాపము దీర్చుమ శ్రీసరస్వతీ!!

31. తుచ్ఛపు యోచనంబులచె దుర్భరమౌ మది నిన్ను వేడగా
స్వచ్ఛత నీయుచూ లలిత సద్గుణశాలిగ నన్ను నిల్పుమా
కచ్ఛపిపై సదా విమలగానముతోడను హాయి గూర్చుచున్
స్వేచ్ఛగ వేడగా సతము సౌఖ్యమునీయుమ శ్రీసరస్వతీ!!

32. వరములొసంగు బ్రహ్మసతి! బ్రాహ్మిగ నిత్యము నిన్ను గొల్వగా
తిరమగు భక్తిదీపికను తీరుగ నిల్పుచు నన్ను బ్రోవుమా
కరుణను నింద్రియమ్ములకు కాపరివై నను సత్పథమ్మునన్
గరిమనొసంగి పల్కులను కానుక నీయుమ శ్రీసరస్వతీ!!

33. దుష్టులైనను క్రూరులైనను దుర్గవై నడిపించుమా
కష్టమందున నిన్ను దల్వగ కాళివై దరిజేరుమా
నష్టమందున సౌఖ్యమొందగ నందమై మదివెల్గుమా
స్పష్టమౌగతి సన్నుతింపగ చంద్రికై మముగావుమా!!

34. కాళిదాసును గాను నే ఘున కైతలల్లుచు నిత్యమున్
లీలలన్నియు కావ్యరీతిని లీలగా లిఖియింపగన్
కాళిదాసును గన్నరీతిని కాళికై నను బ్రోవుమా
హాళి గూర్చెడి పద్యమల్లనుహాయిగాను సరస్వతీ!!

35. సుందరాంగిని బ్రాహ్మినీ ఘునశోభినీ మధురూపిణీ
నందినీ పదభావినీ మదినాదినీ పరమేశ్వరీ
వందనంబిడి భక్తితోడను పావనమ్ముగ వేడగా
మందబుద్ధిని పారద్రోలుచు మాటలిమ్ము సరస్వతీ!!

36. మత్తకోకిల వ్రాయబూనగ మాధురీ దరిజేరుమా
చిత్తమందున ధ్వాంతమంతయు చేతనమ్ముగ జేయుమా
కొత్తరీతిని సాహసించుచు గోరగా నినుధీటుగా
సత్తెలోకము వీడిజేరుమ సాధుపోష సరస్వతీ!!

37. నిర్మదా మదనాశినీ మధునీరదా శివ శారదా
నిర్మలా కళశోభినీ వరనీరదా కవిపోషకా
కర్మిణీ! సుఖదాయినీ! పదగామినీ! ఘనరూపిణీ
మర్మమంతయు వీడివేడగ మాన్యతిమ్ము సరస్వతీ!!

38. చారురూపిణి చక్రవాసిని చంద్రమండలవాసినీ
చారుహాసిని పద్మరాగిణి సత్కళాశివమోదినీ
చారుగామిని విశ్వరూపిణి సత్యరూపిణి మోదినీ
హారనూపురశోభితా మది హాయిగూర్చు సరస్వతీ!!

39. బ్రహ్మమానసవాసినీ పరబ్రహ్మణీ భగమాలినీ
బ్రహ్మపూజిత మౌనిపోషక భాగ్యదాయిని భార్గవీ
బ్రహ్మరూపిణి రమ్యలోచని పావనీ వరదాయినీ
బ్రహ్మలోకము నిన్ను గాంచెడు భాగ్యమిమ్ము సరస్వతీ!!

40. విశ్వసాక్షిణి క్షేత్రపాలిని వేదరూపిణి వేదినీ
విశ్వపూజిని సూక్ష్మరూపిణి విఘ్ననాశిని హంసినీ
విశ్వరూపిణి దైత్యభంజని వేలకాంతుల శోభినీ
విశ్వరూపము నందు గాంచెడు వేడుకిమ్ము సరస్వతీ!!

41. శ్యామభామిని స్నిగ్ధశోభిని సత్త్వరూపిణి బాణినీ
కోమలాంగిని రక్తవర్ణిని క్షోభిణీ సురనాయికా
కామరూపిణి సిద్ధిదాయిని కాలకంఠిని మాలినీ
వామదేవివి బిందుమండల వాసినీవు సరస్వతీ!!

42. ధీటుగ నే సదా కొలచి తీరుగ నీదరి నిల్చి వేడగా
బాటను జూపుచూ నడుపు బాంధవివై భవ సాగరంబునన్
జంటగ నిల్చి నీ దరిని చల్లగ నిల్పుమ సంతసమ్మునన్
బంటుగ సేవలన్ సలుపు భాగ్యము నీయుమ శ్రీ సరస్వతీ!!

43. అతులితమైన నీ పదవి నందనుకోవిదులెల్లరార్తితో
సతతము జేయుచూ తపము సంతసమందున నిన్ను దల్వగా
నతమతినైన నాకిడగనమ్మకతోడను వ్రాయు భాగ్యమున్
శతకమునెట్లు వ్రాసెదను చక్కని రీతిని శ్రీసరస్వతీ!!

44. మానవబంధముల్ నిలచె మాయల ఛాయల రీతి లోకమున్
హీనములాయె ధర్మములు హేయములాయెను సత్యశీలతల్
నేనిక యోపలేక కడు నెమ్మిని జూపుచు నిన్ను వేడగా
హానిని జేయధర్మమును నంతము జేయుమ శ్రీసరస్వతీ!!

45. నాదను వారు వీడి నను నమ్మకద్రోహము జేయు వేళలన్
మోదములేక ధ్వాంతమున మోహమునొంద యధర్మరీతులన్
నీదగు నామమున్ మరచి నెమ్మిని వీడగ బ్రహ్మమందునన్
నీదగు దానిగా నిలపి నందమొసంగుమ శ్రీసరస్వతీ!!

46. తల్లియు దండ్రియున్ పరమదైవము సౌఖ్యములన్ని నీవనిన్
అల్లన నీ పథంబు కడు హాయిని గూడియు నేను సాగుచున్
కల్లలు మాయలన్ మరచి కమ్మని నీ స్మరణంబు జేయగన్
చల్లని తల్లిగా గనుమ చక్కని రీతిని శ్రీసరస్వతీ!!

47. గుండెలయందు నిన్ను నెలకొల్పుచు నిక్కపు బంటునౌచు కై
దండలనీయ సంతతము దాక్ష్యమొసంగుచు వేల్పు వోలె నా
కండగ నుండుమమ్మ మహిమాన్విత నీ చరణారవిందముల్
మెండుగ గొల్తు మోదమున మేధను గోరుచు శ్రీసరస్వతీ!!

48. భ్రాజితమైన నీదు పదభక్తిని గైకొని నేను నిత్యమున్
జాజుల సౌరభమ్ము గల చక్కని పద్యములల్ల బూనగన్
తేజమొసంగుచున్ నడిపి తేకువతోడను నన్ను గావుమా
రంజిలు నామనంబున సలక్షణమౌగతి శ్రీసరస్వతీ!!

49. ఆనతినీయుమమ్మ మహిమాన్విత మాలిని స్నిగ్ధరూప వి
జ్ఞానవిహార! ధ్వాంతహర! నందిని! శోభిని! సిద్ధరూప! య
జ్ఞానవిదూర! నీ పథము సాగుచు నీనుతి జేయుచున్ సదా
పానము జేయ నీ విమల భక్తిరసమ్మును శ్రీసరస్వతీ!!

50. ఎంతటి భాగ్యమే జనని నెంతటి పుణ్యఫలంబు జేతనే
వింతగ యుత్పలంబులను పేర్మిగ నల్లుచు నిన్ను
దల్చుచున్
నంతట నిన్ను గాంచునటు నామది వేడగ నిన్ను నిత్యమున్
శాంతమునీయుమా నిలిపి చక్కని నీదరి శ్రీసరస్వతీ!!

51. నిరుపమ సత్కృపాగరిమనేగొని నాదరి నీవు నిల్వగన్
స్థిరమతినొచు నే జనితి చేతనమందున జ్ఞానమార్గమున్
పరమగు నిన్ను జేరుటకు బంధములన్నియు విస్మరింపగా
వరముగ నిన్నుగాంచు మదివాంఛను దీర్చుమ శ్రీసరస్వతీ!!

52. నిను నిరతమ్ము ధ్యానమున నిక్కపుభక్తి నిల్పు వారికిన్
నిను వినుతించి సన్నుతిని నిర్మలమౌగతి జేయువారికిన్
నిను భజియించు సజ్జనుల నిశ్చలమౌమతి నందగించుచున్
ననువుగ గాంచు నీకిడగ నిత్యము ప్రాంజలి శ్రీసరస్వతీ!!

53. పండితులైన వారలకు పావన నీ చరితా విశేషముల్
మెండుగ మోదమున్ నిడుచు మేలగురీతిని తృప్తి నిచ్చుచున్
దండిగ జ్ఞానమున్ నొసగి ధన్యతతోడను నిల్పి ధాత్రినిన్
మెండుగ నీదరిన్ నిలుపు మిక్కిలి పేర్మిగ శ్రీసరస్వతీ!!

54. వారిజలోచనీ పరమపావని మోదిని విద్యరూపిణీ
నీరసమైన నామదిని నీరసమందున నిల్పి నిత్యమున్
నా రసనాగ్ర మందు కడు నందముతోడను తాండవించుచున్
నీరదవై సదా నిలచి నేర్పు నొసంగుమ శ్రీసరస్వతీ!!

55. మనమున ధర్మమున్ నిలిపి మంచిని బంచుచు మానవాళికిన్
మనమున వీడి శాత్రవము మాన్యత జూపుచు తోటివారికిన్
మనమును జేసి నాలయము మంగళరీతిని నిన్ను నిల్పుచున్
ఘనముగ గొల్తునమ్మ నిను కామితదాయిని శ్రీసరస్వతీ!!

56. నల్లని కేశసంపదది నల్లనిమబ్బుల రీతి తోచెనే
నల్లని కన్నులొప్పునవి నల్లనితారలవోలె వెల్గుచున్
చల్లని నవ్వుచిందెనది జాజుల మల్లెల సౌరభమ్మనే
అల్లన నిన్ను గాంచుటయె నందము నిక్కము శ్రీసరస్వతీ!!

57. వీణను బట్టి నందమున వేల్పుగ భానుని భాసురమ్మనన్
వేణిగ చింది సంతతము పేర్మిగ భక్తుల గాంచుచున్ సదా
రాణిగ వేదసంపదల రంజిలి వాక్కునొసంగి గావుమా
వాణిగ సన్నుతింప నిను పావనరీతిని శ్రీసరస్వతీ!!

58. రక్షనొసంగుమా జనని రక్షణ గోరగ భీతులందునన్
యక్షయమైన సంపదిడు యద్భుతమౌ పదజాల రీతినిన్
లక్షణమౌ ప్రవర్తనొసగు లక్షణమౌ జనసేవ జేయగన్
తక్షణమౌగతిన్ ధరను ధర్మము నిల్పుమ శ్రీసరస్వతీ!!

59. కొలచెద నిన్ను మోదమున కోర్కెను మీఱగ నవ్యరీతినిన్
తలచెద నిన్ను నందమున ధన్యత గోరుచు శాస్త్రరీతినిన్
మలచెద నన్ను సంతతము మంగళ నీ పథమందు నిల్పుచున్
వలచెద నిన్ను నే జనని భాగ్యమనంచును శ్రీసరస్వతీ!!

60. సురవరవంద్య పద్మనయని శోభిని రాగిణి జ్ఞానసాగరీ
కరుణను జూపుమా సతము కామితదాయిని కామరూపిణీ
పరమగు నిన్ను సత్కవులు పావనరీతిని సన్నుతింపగన్
వరముగ కావ్యసంపదను వాడినొసంగుమ శ్రీసరస్వతీ!!
(వాడి: నైశిత్యము; తీక్ష్ణము)

61. సిరిగల నాడు బంధువులు చెంతకు జేరి నిలంచి పేర్మిగన్
మరిమరి జూపి బంధమును మాన్యతతోడను కీర్తి జేయుచున్
సిరివిడనంతయున్ మరచి శీఘ్రముగా విడి మాయరీతినిన్
మరచెదరమ్మ బంధములు మానవతత్వము శ్రీసరస్వతీ!!

62. నీ మహనీయమౌ చరిత నిత్యము కీర్తన జేయుచున్ మదిన్
నీమము దప్పకన్ సతము నిర్మలమౌగతి సన్నుతించెదన్
యీ మహిలోని తీర్థములు నీపదమందున నిల్చు సత్యమున్
నామతినందు నిల్పి కడు నెమ్మిని గొల్తును శ్రీసరస్వతీ!!

63. కపటముతోడ పూజలను క్షణిక భక్తిని జూపి నిత్యమున్
తపనలు, బాధలన్నియును తక్షణరీతిని దీర్చ వేడుచున్
సఫలత గోరి సిద్ధులను శాశ్వతకీర్తిని గోరు మూఢులన్
నెపముల జూపకన్ గనుచు నీయుమ బుద్ధిని శ్రీసరస్వతీ!!

64. కలిపురుషుండు మాయలను కంటికిగానక జేయగా సదా
కలియుగమందు నీ తపము కమ్మని భక్తిని వీడి నిల్వగన్
బలిమిగ నిల్చి సంతతము భక్తినొసంగుచు నీదు మార్గమున్
చెలిమిగ సంతసమ్మునిడి చింతనుదీర్చుమ శ్రీసరస్వతీ!!

65. సంద్రమురీతినొప్పు భవసాగరమందున నిల్పి భవ్యమౌ
యింద్రియ సంపదల్ నిడుచు నిత్యము చంచలవాంఛలీయగా
సాంద్రతతోడ నిన్ను నిలిపి చక్కని భక్తిని జూపుచున్ సదా
భద్రత గోరి వేడెదను బ్రాహ్మిని మాలిని శ్రీసరస్వతీ!!

66. పండితరాజినంతయు పావనరీతిని బ్రోవుచున్ సదా
మెండుగ బుద్ధినిచ్చి కడు మిత్రత జూపెడి పద్మవాసినీ
అండను గోరి నీదయను యద్భుతమౌ గతి వ్రాసి నేను పూ
దండగ జేసి వైచెదను ధన్యత గోరుచు శ్రీసరస్వతీ!!

67. మనుగడ సంతసమ్ముగను మంగళరీతిని గోరి నిత్యమున్
మనుజులు ధర్మమున్ విడుచు మానవతత్త్వము వీడి సాగుచున్
ధనమును ప్రోగుజేసెదరు ధాత్రిని పావనమైన మోక్షసా
ధనధనమైన నీ చరణదాస్యము జేయరు శ్రీసరస్వతీ!!

68. అనిశము నేను జన్మములయందున జేసిన పాపకార్యముల్
ననుకడు బాధలో నిలిపి నా తనువందున వ్యాధులై సదా
అణచుచు క్రమ్మగా సతము నా మది నీగుణ కీర్తనమ్మనన్
ననువుగ నిల్పుమా జనని నందమొసంగుచు శ్రీసరస్వతీ!!

69. రాగములందున సన్నుతిని రాగముతోడను సంతతమ్మునే
ఆగమవంద్య నీకిడెద నద్భుతరీతిని పద్యమాలలన్
రాగసుధానిధీ సకల రాగవిలాస వినోదినీ సదా
రాగముతోడ బ్రోవునను రమ్యపురీతిని శ్రీసరస్వతీ!!

70. పెరిగె నధర్మకృత్యములు విశ్వమునందున ఘోరరీతినిన్
పెరిగె నసత్యమార్గములు వేగముతోడను నిత్యమౌగతిన్
తరిగెను భక్తిశ్రద్ధలను ధన్యతొసంగెడి సాధనమ్ములే
మరచిరి తల్లిదండ్రులను మానవులేమిది శ్రీసరస్వతీ!!

71. గానము జేసి నీచరిత కామితదాయిని నీవనంచునే
జ్ఞానము గోరి నీచరణసన్నిధి నిల్చితినమ్మ భారతీ
మౌనము వీడి బ్రోవు నను మంగళరీతిని బ్రహ్మరూపిణీ
దానము జేయుమా పటిమ తర్కమునందున శ్రీసరస్వతీ!!

72. ఏమని నే లిఖించెదను ఎల్లలెరుంగని నీదు కీర్తినిన్
ఏమని నే లిఖించెదను ఎల్లరు గోరెడి నీ కటాక్షమున్
ఏమని నే లిఖించెదను ఈప్సితమౌ ఘన నీదు గాథలన్
ఏమని నే లిఖింతు మది ఏలిక నీవని శ్రీసరస్వతీ!!

73. పలుకగ బూన నీచరిత పల్కులు లేవని తోచె నా మదిన్
పలుకగ యత్నమింప కడు పావనగాథలు మూగబోతినే
నిలువగ నా రసాగ్రమున నిత్యము ప్రాపుగ మోదమౌగతిన్
వెలుగులతోడ పల్కెదను ప్రీతిగ నీ కథ శ్రీసరస్వతీ!!

74. మౌనమునందునే నిలుతు మంగళమౌ నిను గాంచనాత్మగా
ధ్యానమునందు నే నిలుతు ధన్యత గోరుచు ధాత్రినిన్ సదా
గానము జేతు నీ చరిత కమ్మని పాటగ మోదమందునన్
పానము జేతు నీ విమల పావననామము శ్రీసరస్వతీ!!

75. సన్నుతి జేతునమ్మ సతము సత్పథమందున సంచరించుచున్
సన్నుతి జేతునమ్మ జనని శక్తిని మీఱగ సంతసమ్మునన్
సన్నుతి జేతునమ్మ పరమశక్తిగ నిన్ను దలంచి నా మదిన్
సన్నుతి జేయ సంతతము శారదవై గను శ్రీసరస్వతీ!!

76. గలగల కాలియందియలు గాజులసవ్వడి తోడ బ్రోవరా
గలగల మ్రోగగా లలిత కంకణముల్ నను బ్రోవ దేవి రా
చలువల నీయగా మెరుగుచేలము తోడను శారదాంబ రా
కలువల రీతి నేత్రములు కాంతులు జిందగ రా సరస్వతీ!!

77. జీవులలోన ప్రాణమను చేతనమౌ పరమాత్మవీవెగా
జీవులకెల్ల మోదమిడి చింతను దీర్చెడి తల్లివీవెగా
జీవనమంతమౌ పిదప జీవులు జేరెడి భవ్యగమ్యమౌ
సేవలనందుమా జనని సిద్ధులదాయిని శ్రీసరస్వతీ!!

78. కువలయనాయకీ విమల కోమల శోభల మోహనాంగినీ
ప్రవిమల నీదు నామములు పల్కుచు సంస్తుతి జేయ మోదమున్
నవరస భావనాఘరులు నవ్యపురీతిని శాశ్వతమ్ముగన్
కవికుల సజ్జనావళికి కానుకనీయుమ శ్రీసరస్వతీ!!

79. క్రతువులు సల్పలేను విమలగ్రంథములైనను జూడలేదునే
వ్రతములు పూజలన్నియు కడు పావనరీతిని జేయలేదునే
సతతము నిన్ను నమ్ముచు కడు శ్రద్ధగ దల్చుచు
కోర్కెమీఱగన్
మతి నిలబెట్టి నీ చరణమందున గొల్తును శ్రీ సరస్వతీ!!

80. కోరి భజించు వారి మది కోవెల రీతిని దల్చుచున్ సదా
కోరిక మీఱగా నిలచి కోరిన కోర్కెలు దీర్చు తల్లివై
భూరి కృపారసమ్ములను పేర్మిగనీయుచు వేదమౌ సుధా
సారము దెల్పుమమ్మ సన్నుతి సేయగ శ్రీసరస్వతీ!!

81. కోరుట తప్పుకాదు కడు కుత్సితబుద్ధిని జూపుచున్ సదా
భారమనంచు నీ భజన పాపపు మార్గమునందు నిల్చుచున్
మారనిదౌ మతిన్ గొనుచు మాయలుజేయుచు యీ జగంబునన్
తీరుగ నిన్ను వేడ గనుమ దీనులనంచు శ్రీసరస్వతీ!!

82. పరమగు నిన్ను నమ్మి పరమభక్తిని జూపుచు సంస్తుతించెదన్
తిరమగు నీదు పాదములు తీరుగబట్టియు సన్నుతించెదన్
సరసిజలోచనీ జనని సాంత్వనొసంగుచు గావుమా సదా
సురుచిర వీణ హస్తమున శోభగ బట్టియు శ్రీసరస్వతీ!!

83. రాజరికంబు మారె రాజులు మారిరి దొంగరీతినిన్
మోజులు పెద్దగాయెను ధనమోహము దీరదునెంత దోచినన్
గాజులమేడలందు కనకాంగుల చెంతను నిల్చి మైకమున్
తేజము లేని నాయకుడె ధీరుడు ధాత్రిని శ్రీసరస్వతీ!!

84. ప్రేమలు మెండుగాయె ప్రేమవివాహము మోదమాయిలన్
ప్రేమల పేర పైత్యమను పిచ్చిని గల్గియు ఘోరరీతినిన్
దోమలుగా వనంబులను తుచ్ఛముగా తిరుగాడుచున్ సదా
మోహముదీర పల్కెదరు మోదములేదని శ్రీసరస్వతీ!!

85. గురువులు దెల్ప నీ మహిమ కూర్మిని జేకొని మానసంబునన్
మరిమరి దల్చి నీ చరిత మాన్యత జూపుచు సన్నుతించెదన్
నిరుపమ నీ గుణంబులను నిష్ఠగ పల్కుగ పద్మలోచనీ
సురుచిర లీల జూపి మదిశోభను గూర్చుమ శ్రీసరస్వతీ!!

86. అల్లన చల్లగాలి మదిహాయిని గూర్చగ సంజెవేళలన్
తల్లిగ నీవె నా దరిని తాపముదీర్చగ జేరినావనిన్
యుల్లము పొంగెనే మధుర యుల్లసమందున నాట్యమాడుచున్
చల్లగ సేదదీరె మది సత్కళ శ్రీకరి శ్రీసరస్వతీ!!

87. కనివినెరుంగనట్టి గతి కమ్మని బ్రేమను బంచుచున్ సదా
వినయముతోడ విద్యలను విజ్ఞతనీయుచు నన్ను బ్రోవగా
ననువుగ నీదు గాథలను నద్భుతరీతిని వ్రాయలేని నా
తినని యలుంగకిమ్ము కడు దీక్షణశక్తిని శ్రీసరస్వతీ!!

88. సతమతమైన మానసమున సత్కళ లేకనె విహ్వలంబునన్
సతతము నిల్వగా పరమశక్తి నొసంగుచు సత్పథమ్మునన్
మతినిడి పోషణంబునిడు మంజులభాషిణి శాస్త్రరూపిణీ
శతమగు వందనమ్ములను చక్కగ గైకొను శ్రీసరస్వతీ!!

89. హృదయమునందు జ్యోతులను హృద్యముగా నను తేజరిల్లుచున్
సుధలను నింపి మోదమున శోభనుగూర్చుచు నక్షయమ్ముగా
పదములధార నిచ్చి నను పద్యపథమ్మున నిల్పు తల్లిగా
యెద నిను నిల్పెదన్ జనని నీప్సితమౌ గతి శ్రీసరస్వతీ!!

90. క్షితికి సతమ్ము గూర్చ కడు క్షేమము శ్రేయము ధర్మరీతినిన్
ప్రతిమతినందు నిల్పు పరభావనలెప్పుడు భక్తితోడగన్
ప్రతిదినమొక్క పండుగగ భారతదేశము కాంతిజిమ్ముచున్
చతురతతోడ నిల్వ ఘన శక్తినొసంగుమ శ్రీసరస్వతీ!!

91. కరములు మోడ్చి గొల్చెదను కచ్ఛపిధారిణి జ్ఞానరూపిణీ
సరస కవిత్వసంపదల సమ్మతి గోరుచు సన్నుతించెదన్
వరలగ సత్కవీపథము వాక్కునొసంగుమ యంచు వేడెదన్
పరమగు నీకు సతతము బంటుగ నిల్చెద శ్రీసరస్వతీ!!

92. (వ్యవహారికము)
సతతము వాణినొసంగెడి సత్త్వమొసంగెడి నిన్ను వీడియున్
మతిని మనోవిలాసమిడు మాయల వేణిని బట్టి నిల్చియున్
ప్రతిదినమర్చనంబులను ఫార్వడు లైకులతోడ సల్పెడిన్
గతులను మార్చుమమ్మ జనని కామితదాయిని శ్రీసరస్వతీ!!

93. తల్లిగ, భార్యగా వివిధ ధర్మములందున వ్యస్తమైసదా
తల్లిగ మమ్ము గాచెడి వరదాయినివౌ నిను విస్మరింపగన్
చల్లని నీ కృపారసము జల్లుచు నీదరి నిల్వనీయుమా
మెల్లగ నీ జపంబులను మేలుగ జేయని శ్రీసరస్వతీ!!

94. నగవులు జిందు సల్లలిత నామదిరంజని కావ్యశోభినీ
ధగధగ ప్రజ్వరిల్లు మదిధ్వాంతమునంతము జేసి నామదిన్
పగలుగ నీవు నిల్చి భ్రమభ్రాంతులనన్నియు పారద్రోలుచున్
నిగనిగలాడు రీతినిను నిత్యము గొల్వని శ్రీసరస్వతీ!!

95. మాలినివైన నిన్ను మదిని మాన్యత జూపుచు సన్నుతించెదన్
శాలినివైన నిన్ను పరమశక్తిగ గొల్చెద శాస్త్రరీతినిన్
హేలను గూర్చి గావునను హే విమలాంబికా జ్ఞానసాగరీ
లీలలు జూపి నా మదిని లీలగ నిల్వుమ శ్రీసరస్వతీ!!

96. మోమునుగాంచగా విమలమోహపు మాయలనందు నిల్చెదన్
కోమల మానసమ్ము గనగ కూర్మిని జూపుచు సంస్తుతించెదన్
శ్యామలవైన నిన్ను గనగ సాంత్వన గూరును మానసంబునన్
నా మదినేలుమమ్మ విమలనాయకి శ్రీకరి శ్రీసరస్వతీ!!

97. మన్ననతోడ నే గొలిచి మంగళమౌ నిను నిల్పి ధ్యానమున్
సన్నుతి జేయగా మదిని సంతతశాస్త్ర విధంబునన్ ధరన్
పెన్నిధియైన కరుణ వేగిరమౌగతి నిచ్చి బ్రోచి నీ
సన్నిధి నీయుమా జనని సత్కళ బ్రాహ్మిని శ్రీసరస్వతీ!!

98. విద్యలతల్లి నీ కరుణన ప్రీతిగ బూనెద ధాత్రినందునన్
హృద్యములైన లీలలను హృత్కమలమ్ములు విచ్చునట్లుగన్
పద్యములందు బల్కెదను పల్వురుమెచ్చెడి రీతి నే సదా
తథ్యము నీదు సేవిడును ధన్యత నాకిల శ్రీసరస్వతీ!!

99. నేనొక మువ్వనై సతము నీపద యందియలందు నిల్చెదన్
నేనొక పూవునై విరిసి నీచరణంబులనందు నిల్చెదన్
నేనొక నాదమై నిలుతు నీకరమందున వెలుగు కచ్ఛపిన్
నేనొక బంటునై నిలచి నిత్యము గొల్చెద శ్రీసరస్వతీ!!

100. నేనొక కావ్యమై ధరను నీకథదెల్పెద సంతసమ్మునన్
నేనొక మాలనై లలిత నీగళశోభను గూర్చెదన్ సదా
నేనొక దివ్వెనై నిలుతు నీదరి వెల్గుచు నిన్ను గాంచుచున్
పూనికతోడ గొల్వ నిను బ్రోవగరా నను శ్రీసరస్వతీ!!

101. సరసిజలోచనీ జనని చక్కని చిక్కని జ్ఞానదాయినీ
సరి యిల లేరు నిక్కముగ సత్కవిపోషణి లోకతోషణీ
కరముల మోడ్చి మ్రొక్కెదను కామితదాయిని కామరూపిణీ
చిరముగ చెంత నిల్చి భవచింతను దీర్చుమ శ్రీసరస్వతీ!!

102. మత్తకోకిల వృత్తమందున మాన్యమౌవిధి వ్రాయగన్
చిత్తుజేయుమ మాయలన్నియు చేతనమ్ముగ నిల్చియున్
నత్తవోలెనె సాగుచుండగ నాదరూపిణి జ్వాలవై
చిత్తమందున శ్రీకరమ్ముగ జేరుమమ్మ సరస్వతీ!!

103. కౌళినీ కులయోగినీ మధుకైటభాసుర భంజనీ
మాలినీ భవహారిణీ జనమానసమ్ములవాసినీ
శాలినీ శివదాయినీ సురసన్నుతా జనమోదినీ
శూలినీ నిరపాయనీ కవిశోభనిమ్మ సరస్వతీ!!

104. కష్టము దీర్చుచున్ భవవికారములన్నియు దొల్గజేయుచున్
దృష్టిని నిల్పుమా విమలతేకువతోడను నీదు ధ్యానమున్
స్పష్టత తోడ వేడ నిను సద్గతినొందెడి మార్గమందునన్
హృష్టిని గూర్చి గావు పరమేశ్వరి శాంకరి శ్రీసరస్వతీ!!

105. కలియుగమందు వేడ నిను కామితదాయిని వౌచు గావుమా
మలినములన్ని వీడి కడు మంగళరీతిని సన్నుతింపగన్
కలి వల జిక్కనీక ఘన కంచుకమై నను బ్రోవుచున్ సదా
పలుకుల పల్లవంబులను భారతివై నిడు శ్రీసరస్వతీ!!

106. శరణము శాస్త్రరూప విమలసద్గతిదాయిని భక్తరంజనీ
శరణము పద్మవాసి లలిత సత్కళశోభ మరాళగామినీ
శరణము స్నిగ్ధరూప ధవళ చంద్రవిభూషిత బ్రహ్మచారిణీ
శరణము తేజరిల్లు జనని శర్మద! శారద! శ్రీసరస్వతీ!!

107. జయజయ శోభనాంగిని సుఖసౌఖ్యవిదాయిని లోకతోషణీ
జయజయ చేతనమ్మునడరు సజ్జనపోషిణి సత్యరూపిణీ
జయజయ సద్గుణాఢ్య సకల శాస్త్రవిహారిణి శర్మదాయినీ
జయజయ సర్వవంద్య సగుణ జ్ఞానవిదాయిని శ్రీసరస్వతీ!!

108. మంగళమమ్మ నీకు సకల మంగళదాయిని విశ్వపూజితా
మంగళమమ్మ నీకు యజిత మానసశోభిత చంద్రలోచనీ
మంగళమమ్మ నీకు విశద మంజిమరూపిణి మంజుభాషిణీ
మంగళమమ్మ నీకు సకల మంత్రనివాసిని శ్రీసరస్వతీ!!